## గాంధీజీ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన గాంధీజీ విగ్రహం

తాంసి(భీంపూర్), మే 19 : భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో గాంధీజీ విగ్రహం చేతులను శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. బస్టాండ్ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహం చేతులు విరిగి ఉండడంతో ఈ విషయం బయట పడింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

## భగీరథ నీరు వచ్చేసింది..

*తాంసి మండలంలోని పాలోడి గ్రామంలో హెడీపీఎఫ్ సెకండ్ పైప్‌లైన్ లీకేజీతో భగీరథ నీరు గ్రామంలో సరఫరా కాకపోవడంతో 'నమస్తే తెలంగాణ' పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హెడీపీఎఫ్ సెకండ్ పైప్‌లైన్ లీకేజీని సరిచేసి భగీరథ నీరు ఆదివారం అందించినట్లు మిషన్ భగీరథ ఏఈ మహేశ్ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూస్తామని వెల్లడించారు.*

*- తాంసి, మే 19*




భగీరథ నీరు వచ్చిందని తెలుపుతున్న పాలోడి మహిళ



గుట్టపై ఉన్న టేకిడిరాంపూర్ - గుబిడి నడుమ ప్రమాదకరంగా రోడ్డు

## గుబిడికి రోడ్డేయండి..

- రూ.6 కోట్లు కేటాయించిన కేసీఆర్ సర్కారు
- ఆరు నెలలైనా ముందుకు సాగని నిర్మాణ పనులు
- వానకాలం వస్తుందని గ్రామస్తుల ఆవేదన

భీంపూర్, మే 19 : భీంపూర్ మండలంలోని కరంజి(టి) నుంచి గుబిడికి రోడ్డు మంజూరైంది. కేసీఆర్ సర్కారు దాదాపు 8 కిలోమీటర్లకు రూ.6 కోట్లు కేటాయించింది. రూ.2.36 కోట్లతో బ్రిడ్జి కూడా నిర్మించింది. రోడ్డు నిర్మాణ పనులు కూడా మొదలవుతాయనుకునే లోపే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో నిర్మాణ పనులు మొదలుకావడం లేదు. వచ్చేది వానకాలం అని మళ్లీ ఎప్పటిలాగే అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో బస్సులు రావని, పెన్‌గంగ దాటి మహారాష్ట్రకు పోలేమని, బురదమయంగా మారే రహదారులపై నడువలేమని గుబిడి, కొజ్జన్‌గూడ, టేకిడిరాంపూర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సరిహద్దు గ్రామం గుబిడి రోడ్డు పరిస్థితి

# రైస్‌మిల్లర్ల మాయాజాలం

● సీఎంఆర్ గడువు ముగిసినా పట్టింపు కరువు ● లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లర్ల వద్దే ● అధికారులు హెచ్చరికలు బేఖాతరు ● ప్రభుత్వ చర్యల తీరుపైన అనుమానాలు

నిర్మల్, మే 19(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో రైస్ మిల్లుల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గడువు నిబంధనలను పట్టించుకోకుండా బియ్యం తిరిగి చెల్లించే విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. 2022-23 వానకాలం, యాసంగి సీజన్‌ల నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీఎంఆర్ బియ్యం విషయంలో అంతా తాము చెప్పిందే వేదంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఏ సీజన్‌కు సంబంధించి ఆ సీజన్‌లో సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పాల్సిన రైస్ మిల్లర్లు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్లకు తలొగ్గుతున్న కొందరు అధికారులు వారికి కేవలం నోటీసులు జారీ చేస్తూ రికవరీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో ధాన్యాన్ని రీ-సైక్లింగ్ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఐదారు సీజన్లుగా సీఎంఆర్ బియ్యాన్ని తక్కువగా చెల్లించినప్పటికీ అధికారులు వారి వైపు దృష్టి సారించడం లేదు. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని ఈ నెల 15లోగా అప్పగించాలని ప్రభుత్వం గడువు విధించింది.

### సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించడంలో నిర్లక్ష్యం

జిల్లాలో 1,58,566 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 48 రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం అప్పగించారు. ఇందులో భాగంగా 1,06,831 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రైస్ మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 6,120 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే అప్పజెప్పారు. ఇంకా 1,00,711 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అప్పజెప్పాల్సి ఉన్నది. ప్రభుత్వం విధించిన గడువు ముగిసినప్పటికీ రైస్ మిల్లర్లలో ఏమాత్రం చలనం కనిపించడం లేదు. అయితే రైస్ మిల్లర్లు సీఎంఆర్ విషయంలో కావాలనే జాప్యం చేస్తూ సాంకేతిక కారణాలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2022-23 వానకాలం సీజన్ సీఎంఆర్ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ మిల్లర్లు ప్రతి సీజన్‌లో ఇదే తంతు కొనసాగిస్తుండడం అనుమానాలకు తావిస్తున్నది. 2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం 1,68,177 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని మిల్లర్లకు అప్పగించింది. ఇందులో భాగంగా మిల్లర్లు 1,13,000 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉన్నది. అయితే ఇప్పటి వరకు 95,150 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అప్పజెప్పగా, ఇంకా 34 మిల్లుల నుంచి 17,858 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. వీరికి గత ఫిబ్రవరి 29వ తేదీతో గడువు ముగియగా, బకాయి ఉన్న మిల్లులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ 125 శాతం ఫెనాల్టీ విధించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వానకాలం బియ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన రైస్ మిల్లర్లు యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ విషయంలో కూడా నిర్లక్ష్యం కనబరుస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. 2023-24 వానకాలం సీజన్‌కు సంబంధించి 1,42,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మొత్తం 69 రైస్ మిల్లులకు కేటాయించారు.





రైస్‌మిల్లులను తనిఖీ చేస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్(ఫైల్)

ఇందులో భాగంగా 90,653 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పజెప్పాలి. అయితే ఇప్పటి వరకు కేవలం 15,615 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే తిరిగి ఇచ్చారు. మిగతా 80 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని వచ్చే సెప్టెంబర్ 30 వరకు అప్పజెప్పాల్సి ఉన్నది. ఈ సీఎంఆర్ బియ్యం విషయంలో అధికారులు ఎన్నిసార్లు గడువు విధించినా మిల్లర్లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

### యాసంగిలో తగ్గిన దిగుబడి

2023-24 యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. ముందుగా వ్యవసాయశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే వరి పంటకు చీడపీడలు, తెగుళ్లు సోకడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరానికి 25-30 క్వింటాళ్ల ధాన్యం రావాల్సి ఉండగా, ప్రస్తుతం 14-20 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందంటున్నారు. దీని కారణంగా దిగుబడి అంచనాను వ్యవసాయ శాఖ తగ్గించింది. తాజా అంచనాల ప్రకారం 1,45,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 71 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. వీటికి సంబంధించి 15 వేల మంది రైతులకు రూ.150 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.34 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.116 కోట్లు చెల్లించాలి. కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న ఆటంకాల కారణంగా జూన్ 10 వరకు గడువును పొడిగించే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### కలెక్టర్ సీరియస్

సీఎంఆర్ బియ్యాన్ని అప్పజెప్పే విషయంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రైస్ మిల్లర్లపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆయన పలు చోట్ల రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి సీఎంఆర్‌పై ఆరా తీశారు. కాగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువరు మిల్లర్లకు భారీగా ఫెనాల్టీలు విధించారు. రెండు రైస్ మిల్లులపై కేసులు సైతం నమోదు చేయించారు. అయితే 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ గడువు ముగియడంతో సకాలంలో సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై మరింత కఠినంగా వ్యవహరించి వెంటనే చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు.



ట్రాక్టర్ సాయంతో దుక్కి దున్నుతూ..

## దుక్కులు దున్నుతూ.. భూమి చదును చేస్తూ..

వానకాలం వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతన్న

*మృగశిర కార్తె సమీపిస్తుండడంతో రైతన్నలు వానకాలం సాగు పనులను ముమ్మరం చేశారు. దుక్కులు దున్నుతూ.. భూమిని చదును చేస్తూ బిజీ బిజీ గడుపుతున్నారు. వర్షాకాలం దగ్గర పడుతుండడంతో నాగళ్లు, ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు దున్నుతున్నారు. పశువుల పేడను పొలాల్లో చల్లుతున్నారు. దుక్కులు పూర్తయిన రైతులు గుంటుకలు, ట్రాక్టర్ రోటోవేటర్ల సహాయంతో చదును చేస్తున్నారు. పత్తి, జొన్న, కంది మొదళ్లను ఏరివేసి తగుల బెడుతున్నారు. మృగశికార్తెలో విత్తనాలు నేలలో పడితే పంటలు బాగా పండుతాయనే పెద్దల సూచనతో విత్తనాలు వేసే దిశగా పనులు ముమ్మరంగా చేశారు.*

*- బోథ్, మే 19*



పశువుల పేడను ట్రాక్టర్‌లో పొలానికి తరలిస్తూ..



పత్తి కట్టెను తగుల బెడుతూ..



గుంటుకతో పొలాన్ని చదును చేస్తూ..

## ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నిర్మల్ చైన్‌గేట్, మే19 : ఎయిడ్స్ కాండిల్ లైట్ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆదివారం రాత్రి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఐవీ వ్యాధితో మృతి చెందిన వారి స్మారకంగా సంఘీభావం తెలపడానికి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, జిల్లా మీడియా విస్తరణ అధికారి బారె రవీందర్, డీపీఎంవోలు రాజేశ్వర్, గంగన్న, ఐసీటీసీ కౌన్సిలర్లు, సుదర్శన్, మహిపాల్‌రెడ్డి, ఎన్జీవో పీఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.

## భార్యను చంపిన భర్త

### తాగుడుకు బానిసై రోజూ గొడవ

ఇచ్చోడ, మే 19 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి చెందిన రేణుక వివాహం ఇచ్చోడ మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన గుట్ట వెంకటితో 2015 సంవత్సరంలో జరిగింది. వెంకటి మద్యానికి బానిసై తరచూ రేణుకను కొడుతూ ఉండేవాడు. రేణుక తన అమ్మగారింటికి వెళ్లిపోవడం, వెంకటి తన పెద్ద మనుషులను తీసుకుని వెళ్లి కుటుంబ సభ్యులను నచ్చజెప్పి మళ్లీ తీసుకుని రావడం జరుగుతూ ఉండేది. ఈ మధ్య కాలంలో వెంకటి తల్లి మృతి చెందగా రైతు బీమా కింద రూ.5 లక్షలు వచ్చాయి. దీంతో వెంకటి వచ్చిన డబ్బులతో ఇల్లు కడుతూ, మరోవైపు తాగుడుకు డబ్బులు ఖర్చు పెడుతూ ఉండేవాడు. ఇలా తాగుతూ డబ్బులు ఖర్చు పెడుతుండడంతో రేణుక డబ్బులు సరిపోవని అనేది. ఇంకా తమ దగ్గర మేకలు ఉన్నాయని, వాటిని అమ్ముతానని వెంకటి అనగా రేణుక ఒప్పుకోలేదు. ఈ విషయంలో శనివారం భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రేణుక అన్న కేంద్రె సాయినాథ్‌కు వెంకటి ఫోన్ చేసి రేణుక చనిపోయి ఉందని తెలిపాడు. వెంటనే సాయినాథ్ ఇంటికి వచ్చి చూడగా.. రేణుక మెడకు తాడుతో గట్టిగా బిగించి ఊపిరి ఆడకుండా చేయడం వల్ల చనిపోయిందని గమనించాడు. అప్పటికే వెంకటి పారిపోయాడు. రేణుల అన్న కేంద్రె సాయినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై నరేశ్ తెలిపాడు.

## అధైర్య పడకండి.. అండగా ఉంటాం

● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ● గ్రామస్తుల సమస్యలపై ఆరా ● ఇస్పూర్ పెద్ద గోండుగూడలో పర్యటన

నేరడిగొండ, మే 19 : అధైర్యపడకండి.. మీ అందరికి అండగా ఉంటాం అని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదివారం ఇస్పూర్ పెద్ద గోండుగూడ గ్రామానికి మూడు కిలోమీటర్లు కాలినడకన బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్య ఉన్న తప్పకుండా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. మీకు ఏ సమస్య వచ్చినా.. నేనున్నాని మరిచి పోవద్దని ధైర్యం చెప్పారు. గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో వరదలతో కొట్టుకు పోయిన కల్వర్టులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, గ్రామస్తుల సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్తులతో కాసేపు సమావేశమై సమస్యలపై చర్చించారు. పరిష్కరించేలా చూడాలని ఫోన్‌చేసి అధికారులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కల్వర్టుకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్‌లు జాదవ్ రమేశ్, రాథోడ్ సవాయిరాం ఉన్నారు.

### యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

బజార్‌హత్నూర్, మే 19 : యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం చందునాయక్‌తాండలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. సరదాగ క్రీడాకారులతో బ్యాటింగ్ చేస్తూ క్రీడకారుల్లో నూతనోత్తేజాన్ని కల్గించారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని కోల్హారి గ్రామ సమీపంలో ఇచ్చోడ-బజార్‌హత్నూర్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కంటే ముందుగానే నిర్మాణ పనులను పూర్తి చేయాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజారాం, చంద్రశేఖర్, చిల్కూరి భూమయ్య, రాజేశ్వర్, చైతన్య పాల్గొన్నారు.

### అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

తాంసి, మే 19 : అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన షేక్ జావిద్ వివాహం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో జరగగా ఎమ్మెల్యే హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడి కూతురు ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కౌడాల మహేందర్, గంద్రత్ అశోక్, లస్మారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్



బజార్‌హత్నూర్ కోల్హారి సమీపంలోని వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తూ..

## ముమ్మరంగా వరి కోతలు

*వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తరచూ వర్షాలు కురుస్తుండడంతో భయాందోళన చెందిన రైతులు హార్వెస్టర్‌తో పంటలు కోస్తున్నారు. ఉట్నూర్, దంతన్‌పెల్లి, బిర్సాయిపేట్, గంగన్నపేట్ గ్రామాల్లో వారం రోజుల నుంచి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఈదురుగాలులతో పంట నేలకొరిగిందని, అతిగా వర్షాలు పడితే వడ్లు రాలి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.*

*- ఉట్నూర్ రూరల్, మే 19*



వరి పంట కోస్తున్న హార్వెస్టర్

## నేడు జొన్న కొనుగోళ్ల నిలిపివేత

తాంసి, మే 19 : మండలంలోని సబ్ మార్కెట్ యార్డ్‌లో జొన్న నిల్వలు పుల్లుగా ఉండడం, వర్షం పడే సూచన ఉన్నందున సబ్ మార్కెట్ యార్డులో సోమవారం ఎటువంటి జొన్నల కొనుగోళ్లు నిర్వహించడం జరగదని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో కేశవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ యార్డుకు జొన్నలు తీసుకురావొద్దని తెలిపారు. మంగళవారం యథావిధిగా కొనుగోలు చేపడుతామని తెలిపారు. మండలంలోని జొన్నలు పండించిన రైతులు సహకరించాలని కోరారు.